## క్లుప్తంగా

### విభూదితో రామలింగేశ్వరునికి పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయంలో కార్తిక మాసోత్సవాలలో భాగంగా శనివారం విభూదితో పూజలు చేశారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం స్వామివారికి ప్రీతికరమైన మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పండ్ల రసాలతో అభిషేకం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి దీపారాధన చేశారు.

### డాక్టర్ సరితకు ఆర్ఎస్ఎస్డీఐ అవార్డు



లబ్బీపేట(విజయవాడతూర్పు): మధుమేహంపై విస్తృత అవగాహన కలిగిస్తున్నందుకు గాను నగరానికి చెందిన డయాబెటాలజిస్ట్ డాక్టర్ కాకాని సరిత ఆర్ఎస్ఎస్డీఐ ఉమెన్ డయాబెటాలజిస్ట్ అవార్డు 2023 అందుకున్నారు. ముంబయిలో జరిగిన 51వ జాతీయ ఆర్ఎస్ఎస్డీఐ సదస్సులో అంతర్జాతీయ డయాబెటీస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ అక్తర్ హుసేన్, ఆర్ఎస్ఎస్డీఐ ప్రెసిడెంట్ డాక్టర్ బ్రిజ్ మక్కర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శశాంక్ జోషి చేతుల మీదుగా డాక్టర్ సరిత ఈ అవార్డు అందుకున్నారు. జాతీయ స్థాయి అవార్డు అందుకున్న డాక్టర్ సరితకు పలువురు అభినందనలు తెలిపారు.

### గౌతంరెడ్డికి చిన్న జీయర్ స్వామి ఆశీస్సులు



మధురానగర్(విజయవాడసెంట్రల్): తిరునక్షత్ర మహోత్సవం పురస్కరించుకుని శనివారం ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రా షిర్డీ ముత్యాలంపాడు శ్రీషిర్డీసాయిబాబా మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి సీతానగరంలో శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి గౌతంరెడ్డిని శాలువాతో సత్కరించి ఆశీర్వదించారు.

### మాదక ద్రవ్యాలతో జీవితం అంధకారం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): గంజాయి, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాల వల్ల జీవితం అంధకారంగా మారుతుందని, విద్యార్థులు వాటికి బహుదూరంగా ఉండాలని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ వసంతకుమారి అన్నారు. బాలల హక్కుల వారోత్సవాలలో భాగంగా నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో సింగ్‌నగర్ సెయింట్ ఆన్స్ హైస్కూల్‌లో విద్యార్థులకు 'సే నో టు డ్రగ్స్' అనే అంశంపై శనివారం చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేసి, అభినందించారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ శ్రావణ్, సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి అంజలి, పాఠశాల ఉపాధ్యాయులు శేఖర్ బాబు, రవి, విద్యార్థులు పాల్గొన్నారు.

### బాబా మందిరంలో స్వాములకు అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో కార్తిక మాసం పురస్కరించుకుని స్వాములకు అన్నప్రసాద వితరణ జరిగింది. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపకుడు తంగెళ్ళమూడి వీరమోహనరావు మాట్లాడుతూ బాబా మందిరంలో ప్రతిరోజూ స్వాములకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశామన్నారు. ఈ సదవకాశాన్ని స్వాములు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తొలుత బాబాకు పూజలు చేశారు.

### 20న కుల గణనపై ప్రాంతీయ సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్టెల్లా కళాశాల సమీపంలో గల మెట్రోపాలిటన్ హోటల్ నందు ఈ నెల 20వ తేదీ ఉదయం కుల గణన - 2023పై ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. సదస్సును విజయవంతం చేసేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రాంతీయ సదస్సు ఏర్పాట్లపై కలెక్టర్ ఢిల్లీరావు శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సుకు ఎన్టీఆర్ జిల్లాతో పాటు కృష్ణా జిల్లా, బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు హాజరవుతారన్నారు. ఈ నెల 27వ తేదీ నుంచి వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే చేస్తారన్నారు. కులగణనపై అధికారులు, సచివాలయ సిబ్బంది విస్తృత ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రుక్మాంగదయ్య తదితరులు పాల్గొన్నారు.

## • ఆకట్టుకున్న 'ఛత్రపతి శివాజీ'

ఛత్రపతి శివాజీ 350వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం రాత్రి డాక్టర్ రామన్ ఫౌండేషన్, సాయిబాబా నాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శించిన శ్రీ ఛత్రపతి శివాజీ చారిత్రక నాటకం ఆద్యంతం ఆకట్టుకుంది. శివాజీ బాల్యం, తల్లి జిజియాబాయి ప్రేరణతో యుద్ధ విద్యలు నేర్చుకోవడం, పరస్త్రీలను తల్లిగా భావించే సంస్కారం తదితర అంశాలతో నాటకం సాగింది. దాదాపు 60 మంది కళాకారులు ఈ ప్రదర్శనలో భాగమయ్యారు. – విజయవాడ కల్చరల్



ఛత్రపతి శివాజీ నాటకంలోని ఓ సన్నివేశం

## • ఖేలో.. జీతో..




అహ్మదాబాద్‌లో నేడు ఆదివారం జరగనున్న ఐసీసీ మెన్స్ వరల్డ్ కప్ ఫైనల్స్‌లో భారత జట్టు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని బీఆర్‌టీఎస్ రోడ్డుపై శనివారం ఈ బాలుడి ప్రదర్శన ఆకట్టుకుంది. ఇండియా జెర్సీ ధరించి, ఖేలో ఇండియా.. జీతో ఇండియా అనే నినాదంతో కూడిన ప్లకార్డు, జాతీయ జెండా చేతపట్టి పరుగు తీస్తూ ఇలా దేశ భక్తి చాటుకున్నాడు. – సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

## జగనన్న సురక్ష పేదల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

మధురానగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష పేదల ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 28వ డివిజన్ 204వ వార్డు సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి కనపర్తి కొండలరావుతో కలిసి వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గరనుంచి పేదల ఆరోగ్యానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఇస్తోందన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కరూ అనారోగ్యంతో బాధపడకూడదనే మహోన్నత లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తీసుకువచ్చారన్నారు. అనంతరం వైద్యసేవలను స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వార్డు సచివాలయం సిబ్బంది, ఆరోగ్యకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

## శ్రీశ్రీ కవితా రీతులను అధ్యయనం చేయాలి

**ఏపీ అధికార భాషా సంఘం అధ్యక్షుడు విజయబాబు**

విజయవాడ కల్చరల్: శ్రీశ్రీ కవితా రీతులను యువకవులు అధ్యయనం చేయాలని, ఆయన కవిత్వంలో సమాజ చిత్రీకరణ కనిపిస్తుందని ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు అన్నారు. మల్లెతీగ సాహిత్యసేవా సంస్థ ఆధ్వర్యంలో 56వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శనివారం బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో కొమ్మవరపు విల్సన్‌రావు రచించిన నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటిని విజయబాబు ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ గుండె కింద తడిని స్పృశించేదే అసలైన కవిత్వమని, సమాజాన్ని కదిలించి చైతన్య పరిచే శక్తి కవిత్వానికి ఉందన్నారు. వేగం పెరిగిన నేటి కాలంలో అధ్యయనం కనమరుగైపోయిందన్నారు. నేటి తరాన్ని గ్రంథాలయాలవైపు నడిపించాలని సూచించారు. విప్లవ రచయితల సంఘం అధ్యక్షుడు అరసవిల్లి కృష్ణ మాట్లాడుతూ కవిత్వం కోసం కుటుంబాన్ని వదిలేసిన వారు ఎందరో ఉన్నారన్నారు. మల్లెతీగ సాహిత్యవేదిక నిర్వాహకుడు కలిమిశ్రీ మాట్లాడుతూ కవులను, కళాకారులను ప్రోత్సహించడానికి మల్లెతీగ సాహిత్యవేదిక కృషి చేస్తునట్లు తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ పరిషత్ చైర్‌పర్సన్ జమలపూర్ణమ్మ, ఆంధ్రప్రదేశ్ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఘంటా విజయకుమార్, కవి బంగార్రాజు, సాగర్ శ్రీరామ కవచం కవితా సంపుటిపై మాట్లాడారు. యువకవి అనిల్ డ్యానీ పుస్తక సమీక్ష చేశారు. రచయిత విల్సన్‌రావు తనకు ప్రేరణ కలిగించిన అంశాలను వివరించారు.



నాగలి కూడా ఆయుధమే కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న విజయబాబు, వేదికపై కలిమిశ్రీ, అరసవిల్లి కృష్ణ, అనిల్ డ్యానీ

## సహజ అభ్యుదయ కవి సోమసుందర్

విజయవాడ కల్చరల్: సహజ అభ్యుదయ కవి అవంత్స సోమసుందర్ అని కవి, విమర్శకుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు అన్నారు. 56 వ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం కవి, సాహితీ విమర్శకుడు అవంత్స సోమసుందర్ జీవన రేఖలు అంశంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. గుమ్మా మట్లాడుతూ తెలుగు సాహిత్యంలో కవితా ప్రక్రియను మలుపు తిప్పిన మహనీయులలో సోమసుందర్ ఒకరని అన్నారు. సాహితీ ప్రముఖుడు పన్నాల సుబ్రహ్మణ్య భట్టు మాట్లాడుతూ సోమసుందర్ కవితా రీతిని తెలుసుకోవడానికి వజ్రాయుధం చాలన్నారు. కార్యక్రమంలో హనుమంతరాయ గ్రంథాలయ నిర్వాహకులు బి.కృష్ణప్రియ, ఎం.అరుణ, గ్రంథాలయ అధ్యక్షుడు దోగిపర్తి శంకరరావు, కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, గ్రంథాలయ పాలక మండలి సభ్యుడు నీలం దుర్గారావు, బెల్లపు బాబ్జీ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న డాక్టర్ గుమ్మా సాంబశివరావు, వేదికపై మండలి బుద్ధప్రసాద్, డాక్టర్ జీవీ పూర్ణచందు

## చిత్ర కళ విశిష్టతను చాటేందుకే ఆర్ట్ ప్యారడైజ్

కృష్ణలంక(విజయవాడతూర్పు): చిత్ర కళ విశిష్టతను చాటేందుకే ఆర్ట్ ప్యారడైజ్ నిర్వహిస్తున్నామని కార్యక్రమ నిర్వహకుడు స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆర్ట్ ప్యారడైజ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, జాషువా సాంస్కృతిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ నడిపల్లి రవికుమార్, రజనిచౌదరి దంపతుల ప్రోత్సాహంతో స్ఫూర్తి క్రియేటివ్ ఆర్ట్ స్కూల్, ఆర్ట్ మేట్, ది స్కూల్ ఆఫ్ ఆర్టిస్ట్స్, చిత్రం ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్ ఆర్ట్ ప్యారడైజ్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. బాలోత్సవ భవన్‌లో ఆదివారం ఉదయం పది గంటలకు 40 మంది విద్యార్థులతో ఏర్పాటు చేసిన చిత్ర కళ ప్రదర్శనను ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ కార్యదర్శి ఎం.వి.సాయిబాబు ప్రారంభిస్తారని తెలిపారు. మధ్యాహ్నం మూడు నుంచి ఐదు గంటల వరకు ఒకటో తరగతి నుంచి డిగ్రీ విద్యార్థులకు చిత్రకళా ప్రపూర్ణ నడిపల్లి సంజీవరావు స్మారక చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఉదయం పది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు పేర్లు నమోదు చేసుకోవచ్చని సూచించారు. సాయంత్రం బహుమతుల ప్రదానోత్సవం జరుగుతుందన్నారు. జాషువా సాంస్కృతిక వేదిక ప్రధాన కార్యదర్శి గుండు నారాయణరావు, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్ కో కన్వీనర్ గిరిధర్ అరసవల్లి, మహిళా విభాగం కన్వీనర్ సంధ్యారాణి, ఈవెంట్ కన్వీనర్ ఎస్.పి.మల్లిక్, కళాసాగర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ట్ ప్యారడైజ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

## ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రత పాటించాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆహార పదార్థాల తయారీ, విక్రయించే విధానం, వడ్డన విషయాల్లో శుభ్రత తప్పనిసరిగా పాటించాలని ఐఐఈఎస్‌టీ (ఇండస్ట్రియల్ ఇంక్యుబేషన్ ఎంట్రప్రెన్యూర్ ఆఫ్ స్కిల్ ట్రైనింగ్) ఫెడరేషన్ రాష్ట్ర ఇన్‌చార్జి పీయూష్ అన్నారు. ఆహార పదార్థాల తయారీలో పాటించవలసిన నియమ నిబంధనలు, ఆహార పదార్థాల తయారీ, విక్రయించే విధానం, వడ్డన విషయాలపై శనివారం ఐఐఈఎస్‌టీ ఆధ్వర్యాన రెస్టారెంట్, ఫుడ్ ప్రొడక్ట్ నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్‌టీఆర్ జిల్లా ఇన్‌చార్జి శ్రీపతి సురేష్‌తో కలిసి శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బేకరీలలో వర్కర్స్ చేతులకు గ్లోవ్స్ తప్పనిసరిగా ధరించాలన్నారు. అనంతరం కోవిడ్ తదితర కారణాలతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఫాస్టాక్ (ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ సర్టిఫికెట్) విధివిధానాలపై వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆఫీసర్ ఫణిదర్, నవీన్, ప్రసాద్, శ్రీధర్, సుందర్, బాలాజీ, రుషి, తులసి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



ఫుడ్ ప్రొడక్ట్ నిర్వాహకులతో ఐఐఈఎస్‌టీ ప్రతినిధులు

## స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన వారికి, ఇంటర్ రెండవ సంవత్సరం చదువుతున్న వారికి హెచ్‌సీఎల్ బీటెక్ సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ ఇస్తుందని పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీఎస్ఎస్ఎన్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన ఇంటర్మీడియెట్ కళాశాలలను హెచ్‌సీఎల్ బీటెక్ ప్రతినిధులు సందర్శించి, విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సులకు సంబంధించి అవగాహన కల్పిస్తారని, ఆ సమయంలో వారికి సహకరించాలని కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు. శిక్షణ పూర్తిచేసిన వారికి ఉపాధి అవకాశాలను కూడా అదే సంస్థ కల్పిస్తుందని, ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## అందరూ ఆరోగ్యంగా ఉండాలనేదే జగనన్న లక్ష్యం

పాయకాపురం(విజయవాడరూరల్): రాష్ట్రంలోని ప్రజలందరూ ఆరోగ్యంగా వుండాలనే సదుద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సచివాలయం పరిధిలో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారని ఏపీ ప్లానింగ్‌బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 61వ డివిజన్ 257 సచివాలయం పరిధిలో, 63వ డివిజన్ 673వ సచివాలయం పరిధిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు జరిగాయి. ఈ శిబిరాల్లో స్థానిక కార్పొరేటర్లు ఉమ్మడి రమాదేవి, మోదుగుల తిరుపతమ్మతో కలిసి ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు. అనంతరం రోగులకు ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉమ్మడి వెంకట్రావ్, మోదుగుల గణేష్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## ఠాగూర్ గ్రంథాలయంలో వ్యాసరచన, క్విజ్ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇంటర్ విద్యార్థులకు సామాజిక, సాంస్కృతిక, చరిత్ర విజ్ఞానానికి గ్రంథాలయాలు ఏ విధంగా ఉపయోగపడతాయనే అంశంపై ఇంటర్ విద్యార్థులకు, డిజిటల్ గ్రంథాలయం ఎలా ఉండాలి అనే అంశంపై డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి రమాదేవి మాట్లాడుతూ రీసెర్చ్ చేసే వారికి పాత పుస్తకాలు, పత్రికలు భద్రపరిచే గ్రంథాలయాలు కల్పతరువు అని అన్నారు.

## సమాజహితం కోరేది సాహిత్యం

విజయవాడ కల్చరల్: సమాజ హితం కోరేది సాహిత్యమని శారదా కళాసమితి వ్యవస్థాపకుడు దోగిపర్తి శంకరరావు అన్నారు. శారదా కళాసమితి ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం డాక్టర్ రామోజు శ్రీధర్‌రావు రచించిన డాక్టర్ ఇన్ లవ్ నవల ఆవిష్కరించారు. ఏపీ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ మాట్లాడుతూ శారదా కళాసమితి వారు కళా సాంస్కృతిక రంగాలకు పెద్దపీట వేస్తూ కార్యక్రమాలను నిర్వహిస్తునట్లు తెలిపారు. డాక్టర్ రావి శారద మాట్లాడుతూ నవలలోని అంశాలను వివరించారు. మాచవరం వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్ పొట్లూరి శారద, వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ రామోజు మోహన పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా పద్మశ్రీ హేమంత్, ఘంటసాల పవన్‌కుమార్ బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు.

## సామాజిక ఉద్యమాలకు ప్రేరణ తెలుగు నాటకం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అనేక సామాజిక ఉద్యమాలకు తెలుగు నాటకం ప్రేరణనిచ్చిందని ప్రముఖ నాటక రచయిత డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుక్ ఫెస్టివల్ లైబ్రరీ హాల్‌లో 'తెలుగు నాటక సాహిత్యం' అంశంపై సదస్సును శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు మాట్లాడుతూ తెలుగు నాటకం ఎందరినో ప్రభావితం చేసిందన్నారు. సాహితీవేత్తలు డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, డాక్టర్ వెన్నా వల్లభరావు తదితరులు తెలుగు నాటక సాహిత్యం విశిష్టతను వివరించారు. కార్యక్రమాన్ని సాహితీవేత్త డాక్టర్ జీవీ పూర్ణచంద్ నిర్వహించారు. బుక్ ఫెస్టివల్ సొసైటీ ప్రముఖులు మనోహర్‌నాయుడు, లక్ష్మయ్య, బెల్లపు బాబ్జీ, పల్లవి వెంకటరమణ పాల్గొన్నారు.

## దిశ యాప్‌తో మహిళలకు భరోసా

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని సత్యనారాయణపురం లోని చిత్తరంజన్ గ్రంథాలయం ఆధ్వర్యంలో శనివారం ఏకేటీపీఎం స్కూల్, శారదా కళాశాల విద్యార్థులకు 'నేటి సమాజంలో స్త్రీ పాత్ర' అనే అంశంపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న శారద కళాశాల లెక్చరర్ సీహెచ్‌వీపీ గాయత్రి విద్యార్థులకు దిశ చట్టం ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం నిర్వహించిన ముగ్గుల పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ లెక్చరర్ బి.సావిత్రి, భారతీయ మహిళా మండలి సభ్యురాలు ఆర్.ఉషా, గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్, ఏకేటీపీ మున్సిపల్ హైస్కూల్ ఉపాధ్యాయురాలు రమ్య, కె.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పరిపూర్ణ ఆరోగ్యానికి జగనన్న సురక్ష

**ఎమ్మెల్యే మల్లాది విష్ణు**

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికీ పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. స్థానిక 57వ డివిజన్ 233వ వార్డు సచివాలయ పరిధిలో చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం న్యూ రాజరాజేశ్వరిపేటలో శనివారం జరిగింది. దీనిలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపర్చాలనే ప్రధాన లక్ష్యంతో తలపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం దిగ్విజయంగా జరుగుతుందన్నారు. వైద్య బృందాలే ఇంటికి వచ్చి వైద్య సేవలు అందించడం దేశ చరిత్రలో ఎక్కడా లేదని, ఈ కార్యక్రమం ద్వారా లక్షలాది మంది జీవితాల్లో నూతన వెలుగులు నిండుతున్నాయన్నారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. స్థానిక కార్పొరేటర్ ఇసరపు దేవి రాజారమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



మందుల కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు, పక్కన కార్పొరేటర్ దేవి

## సీఎం జగన్‌తోనే రాష్ట్రం సస్యశ్యామలం

- రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు
- 58వ డివిజన్‌లో ఆరో రోజు గడప గడపకు మన ప్రభుత్వం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. నగరంలోని 58 వ డివిజన్ 239 వ వార్డు సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజతో కలిసి ఆయన తోట వారి వీధిలో 178 గడపలను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పరిపాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని, అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. గత టీడీపీ హయాంలో ఈ ప్రాంతాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కోట్లాది రూపాయల నిధులతో డివిజన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ముఖ్యంగా తోట వారి వీధి ఒక మోడల్ ప్రాంతంగా రూపుదిద్దుకుంటోందన్నారు. రహదారుల గురించి మాట్లాడే నైతిక అర్హత టీడీపీ, జనసేన పార్టీలకు ఏమాత్రం లేదని ఎమ్మెల్యే విష్ణు అన్నారు. చంద్రబాబు హయాంలో రోడ్లు వేస్తామంటూ బ్యాంకుల నుంచి రూ.3,800 కోట్లు అప్పు తీసుకువచ్చి, రోడ్లు వేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని గుర్తుచేశారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత రూ.7,340 కోట్ల నిధులతో 14,230 కి.మీ. మేర రహదారులను నిర్మించినట్లు వివరించారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గంలోనే రూ.138.88 కోట్ల వ్యయంతో 129.62 కి.మీ. మేర 551 రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ డీఈ(ఇంజనీరింగ్) గురునాథం, వైఎస్సార్‌సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, ఉమ్మడి వెంకట్రావు, కృష్ణమోహన్, వసంత్, శర్మ, తోపుల వరలక్ష్మి, శోభన్, యక్కల మారుతి, మహేశ్వరి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

## పి.వి.రమేష్‌కు ఎక్సలెన్స్ అవార్డు

రామవరప్పాడు: విద్యారంగాభివృద్ధికి విశేష కృషి చేసిన, ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల అకడమిక్ ఎడ్వయిజర్ పి.వి.రమేష్‌కు అరుదైన గౌరవం లభించింది. పలు రాష్ట్రాలలో ఫార్మసీ, మెడికల్, డెంటల్, నర్సింగ్, డిగ్రీ కళాశాలలకు ఈ పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా విద్యా, వసతులపై వ్యక్తిగత శిక్షణ ఇచ్చినందుకు గానూ ఇటీవల ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో టైమ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో విద్యారంగంలో రమేష్‌కు ఈ ఎక్సలెన్స్ అవార్డును బీజేపీ నేషనల్ సెక్రటరీ మంజిర్ సింగ్ షిరస చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్సార్కే ఫౌండేషన్ సెక్రటరీ బోయపాటి శ్రీ కృష్ణ మాట్లాడుతూ పలు కళాశాలల్లో అధ్యాపకులకు, విద్యార్థులకు పి.వి రమేష్ శిక్షణ అందించారన్నారు.



ఢిల్లీలో ఎక్సలెన్స్ అవార్డును అందుకుంటున్న విద్యావేత్త పి.వి.రమేష్

## విజ్ఞాన జ్యోతులు వెలిగించాలి

విజయవాడకల్చరల్: సమాజంలో విజ్ఞాన జ్యోతులను వెలిగించాలని, అందుకు గ్రంథాలయాలను వినియోగించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా బందరురోడ్డులోని ఠాగూర్ గ్రంథాలయంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన కవయిత్రి, కాలమిస్ట్ చిల్లర భవానీదేవికి జ్ఞానజ్యోతి పురస్కారం అందజేశారు. ఏపీ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రచయితల సంఘం ఉపాధ్యక్షుడు ఎ.జయప్రకాష్, సంఘ కార్యదర్శి సుభాని, బి.ఆంజనేయరాజు, సీహెచ్ శర్మ, పి.రాజశేఖర్ పాల్గొన్నారు.

## • నగరంలో శ్రీలీల సందడి



ఆటోనగర్(విజయవాడతూర్పు): నగరంలో సినీ నటి శ్రీలీల శనివారం సందడి చేసింది. విజయవాడ అశోక్‌నగర్ పవర్ మాల్‌లో సోల్ ఆఫ్ సౌత్ ఇండియన్ క్యూసైన్ రెస్టారెంట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీలీలను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు పోటీ పడ్డారు. అనంతరం శ్రీలీల విలేకరులతో మాట్లాడుతూ.. తాను వెజిటేరియన్‌ను మాత్రమే భుజిస్తానన్నారు. నాన్‌వేజ్ మిస్ అవుతున్నానని బాధపడుతున్నానని, ప్రస్తుతం ఆదికేశవ మూవీలో నటిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఐరన్ హిల్ గ్రూప్ కో ఫౌండర్ విధాత మాట్లాడుతూ నోరూరించే సౌత్ ఇండియా వంటకాలు రుచికరంగా ఉంటాయన్నారు. మొత్తం 5 రాష్ట్రాల్లో తమ రెస్టారెంట్లు విస్తరించిందన్నారు. కార్యక్రమంలో కిశోర్‌బాబు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.